ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 8 ఆగస్టు 2025



గురుకుల టెండర్లలో అయోమయం
- టెండర్ల ఫారం ధర నిర్ణయించని ప్రభుత్వం
- ఒక్కో జిల్లాలో ఒక్కో ధర..
- పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లో రూ. 25 వేలు
- మిగతా జిల్లాల్లో రూ. 2 వేల నుంచి 10 వేల వరకు
- ఏకీకృత విధానంలో టెండర్లు అంటూ వేర్వేరు ధరలా?

7

విమానాశ్రయం ఏర్పాటుకు అనుమతులివ్వండి
- కేంద్ర మంత్రిని కోరిన ఎమ్మెల్యేలు



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యేలు

పెద్దపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అంతర్గాంలో విమానాశ్రయం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కేంద్ర విమానయాన శాఖ మంత్రి ఎర్రం రామ్మోహన్ నాయుడిని కోరారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యేలు ఢిల్లీలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. విమానాశ్రయం ఏర్పాటుకు అంతర్గాంలో దాదాపు 500 ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని, సమీపంలో ఒక ప్రైవేట్ విమానాశ్రయం ఉన్నందున పౌర విమానయాన శాఖ ఏర్పాటుకు అనువైన ప్రాంతంగా దోహదపడుతుందన్నారు. రామగుండం ప్రాంతం మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిందని, ఇక్కడ విమానాశ్రయం ప్రాధాన్యం ఎంతో ఉందన్నారు. ఇక్కడ విమానాశ్రయం ఏర్పడితే దేశంలోని పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెరిగి ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. పెట్టుబడులకు అవకాశాలు పెరుగుతాయని, ఆర్థిక అభివృద్ధి పెరుగుతుందని, విమానాశ్రయం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన వర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ఈ నెల 15 నుండి నిరవధిక సమ్మె చేపడుతామని మధ్యాహ్న భోజన వర్కర్ల యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ఏఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ 23 ఏళ్లుగా డిమాండ్ల సాధనకు పోరాటాలు చేస్తున్నామని, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు రూ.10 వేల వేతనం, కార్మికుల సమస్యలు తీర్చుతామని చెప్పి రెండేళ్ల కావస్తున్నా ఇప్పటి వరకు నెరవేరలేదన్నారు. గత నెలలో జిల్లా విద్యాధికారికి వినతి పత్రం ఇచ్చినా ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదని, ఈ నెల 15 నుంచి సమ్మెకు సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. నాయకులు విజయ, రత్నమాల, రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.

టాస్క్ సెంటర్ కోర్సులపై ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): యువతకు టాస్క్ సెంటర్ ద్వారా అందించే కోర్సులపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో టాస్క్ సెంటర్‌లో కల్పిస్తున్న విద్య, ఉద్యోగ అవకాశాలపై అధికారులు, కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఆరు నెలల్లో టాస్క్ సెంటర్ ద్వారా వెయ్యి మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో పరిశ్రమల శాఖ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమశాఖలు, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో సమన్వయంతో పలు కార్యక్రమాలను అమలు చేస్తూ ఉపాధి కల్పించాలన్నారు. వారికి అవసరమైన నైపుణ్యాల శిక్షణ కోసం నిధులు, లాజిస్టిక్స్, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు సహకారం అందుతుందన్నారు. టాస్క్ సెంటర్‌లో వివిధ కోర్సులు నేర్చుకున్న యువతకు 7 లక్షల ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో రాఖీల విక్రయాలు



మార్కెట్‌లో రాఖీల అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ నెల 9న శనివారం రాఖీ పండుగ సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని జెండా కూడలి వద్ద రెండు రోజుల ముందు నుంచే రాఖీలు విక్రయిస్తున్నారు. పలు షాపులతో పాటుతోపుడు బండ్లపైన చిరు వ్యాపారులు విక్రయాలు చేపట్టారు. రూ.20 నుంచి మొదలుకొని గరిష్ఠంగా రూ.150 వరకు పలు రకాల్లో రాఖీలు ఉన్నాయి. అయితే మంగళవారం నుంచి ఆ ప్రాంతంలో రోడ్డు మరమ్మతు చేపట్టడంతో టిప్పర్లతో కొనుగోలుదారులు రావడం లేదని వ్యాపారులు పేర్కొన్నారు. పండుగ అనంతరం రహదారి మరమ్మతు చేపడితే బాగుండని వ్యాపారులు పేర్కొంటున్నారు.

- పెద్దపల్లి కల్చరల్,ఆంధ్రజ్యోతి

వరలక్ష్మీ నమోస్తుతే
నేడు ప్రత్యేక పూజలు.. వ్రతాలు...



శ్రావణ మాసం పూజలు, వ్రతాలకు ప్రత్యేకం. నేడు వరలక్ష్మి శుక్రవారం సందర్భంగా ఇండ్లలో, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో ఏదో ఒక వారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించుకోవచ్చని పండితులు పేర్కొంటున్నారు. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఉదయాన్నే ఇంటికి మామిడి ఆకులు, పూలతో అలంకరిస్తారు. అమ్మవారిని కలశం, ప్రమిద, విగ్రహరూపంలో కాని, పసుపు రూపంలో ప్రతిష్ఠించి పూజిస్తారు. ముగ్గురు, ఐదుగురు, లేదా ఎనిమిది మంది ముత్తైదువులకు తాంబూలం ఇవ్వాలి. -మంథని, ఆంధ్రజ్యోతి

హెచ్‌ఎంఎస్‌తో తెలంగాణ జాగృతి ములాఖత్



- టీబీజీకేఎస్‌కు ప్రత్యామ్నాయంగా మంతనాలు
- సింగరేణి కేంద్రంగా బీఆర్‌ఎస్‌పై పోరుబాట
- హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌తో చర్చలు
- ఈనెల 10న అధికారిక ప్రకటన

గోదావరిఖని, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): హెచ్ఎంఎస్‌తో తెలంగాణ జాగృతి కలిసి పని చేసేందుకు మంతనాలు పూర్తయ్యాయి. కోల్‌బెల్ట్ ప్రాంతంలో బీఆర్‌ఎస్‌పై పోరుబాటకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కార్యాచరణ రూపొందిస్తోంది. బీఆర్‌ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) గౌరవ అధ్యక్షురాలిగా పదేళ్ళు కవిత కొనసాగారు. ఈ క్రమంలో ఆమె సింగరేణిలోని 11ఏరియాల్లో కేడర్‌ను ఏర్పాటు చేసుకొంది. కవితకు, బీఆర్‌ఎస్‌కు మధ్య కొన్ని నెలలుగా కలహాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు టీబీజీకేఎస్ బాధ్యతలు అప్పగించింది. దీనికి కౌంటర్‌గా కవిత సింగరేణిలో కొత్త రాజకీయానికి తెరలేపుతోంది.

జాతీయ కార్మిక సంఘం హెచ్‌ఎంఎస్‌కు అనుబంధంగా ఉన్న సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్‌తో కలిసేందుకు కవిత సిద్ధపడింది. గత నెల 30న హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌తో హైదరాబాద్‌లో ఆమె చర్చించినట్టు తెలిసింది. సింగరేణిలో జాగృతికి సంబంధించిన ప్రతినిధులను, కేడర్‌ను హెచ్ఎంఎస్‌తో కలిసి నడిపేందుకు ప్రాథమికంగా అవగాహన జరిగినట్టు తెలిసింది. ఈనెల 10న సింగరేణిలోని 11 డివిజన్ల నుంచి సింగరేణి జాగృతి ప్రతినిధులు, హెచ్‌ఎంఎస్ అన్ని డివిజన్ల ప్రతినిధులతో సమావేశం ఏర్పరచి అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ మేరకు రెండు సంఘాలు డివిజన్ల స్థాయి నుంచి సన్నద్ధమవుతున్నాయి.

కవిత తన రాజకీయ అస్తిత్వ నిర్మాణంలో భాగంగా అనుబంధంగా ఒక జాతీయ కార్మిక సంఘాన్ని కలుపుకొని నడిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. సింగరేణి ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్‌కు మద్దతుగా కవిత జాగృతి బృందం పని చేయడం ఆమె రాజకీయ కార్యకలాపాల్లో హెచ్‌ఎంఎస్ భాగస్వామ్యం కావడంపై పరస్పర అంగీకారం కుదిరినట్టు సమాచారం. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కోల్‌బెల్ట్ ప్రాంతం నుంచే కవిత అసెంబ్లీకి పోటీ చేసేందుకు కూడా ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ నుంచి ప్రతిపాదన చేసినట్టు తెలిసింది.

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో కవిత నాయకత్వంలో హెచ్‌ఎంఎస్ కార్మిక సంఘ నిర్మాణానికి చర్చల్లో కార్యాచరణ నిర్ణయించుకున్నట్టు హెచ్‌ఎంఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఈనెల 10న సింగరేణి జాగృతి, హెచ్‌ఎంఎస్ కలిసి పని చేస్తాయా, హెచ్‌ఎంఎస్‌లో సింగరేణి జాగృతిని విలీనం చేస్తారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. హెచ్‌ఎంఎస్ నుంచి రియాజ్ అహ్మద్‌కు జేబీసీసీఐలో కూడా సభ్యత్వం ఉండడం, జాతీయ కార్మిక సంఘంగా సింగరేణిలో హెచ్‌ఎంఎస్ కేడర్ కలిగి ఉండడం, ఎమ్మెల్సీ కవితకు సైతం సింగరేణి వ్యాప్తంగా ఎంతో కొంత కేడర్ ఉండడం, ఈ రెండు వర్గాల కలయిక ప్రతిపాదనలకు ప్రాధాన్యం పెరిగింది.

ఇదంతా టీబీజీకేఎస్‌కు ప్రత్యామ్నాయంగా సింగరేణిలో కవిత తన బలాన్ని పెంచుకోవడానికేనని పలువురు పేర్కొంటున్నారు. ఈనెల 30, 31తేదీల్లో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో హెచ్‌ఎంఎస్ 42వ మహాసభలను నిర్వహిస్తున్నది. ఈ మహాసభలకు జాగృతి ప్రతినిధులతోపాటు కల్వకుంట్ల కవిత కూడా హాజరయ్యే మిగతా 8వ పేజీలో

రామగుండంలో ఇసుక దందాపై
కలెక్టర్ సీరియస్
- సుమోటో కేసుల నమోదుకు ఆదేశాలు

కోల్‌సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అక్రమార్కులు ఇసుక దందాకు పాల్పడడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఇప్పటికే పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని ఐదు చోట్ల నుంచి ఇసుక లోడింగ్ జరిగినట్టు తెలుస్తుంది. స్థానిక ఇంటినిర్మాణాలకు వినియోగించాల్సిన ఇసుకను హైదరాబాద్ తరలించి అమ్ముకునే దందాకు తెర లేపారు. ఎన్‌టీపీసీ ప్రాంతాల్లో ఇసుక పక్కదారి పట్టడంపై ఆరోపణలు వస్తున్నాయి. ఎన్‌టీపీసీకి చెందిన పలువురు కాంట్రాక్టర్లు ట్రాక్టర్లతో డంపింగ్ చేసుకుని పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రూ.1000కి ట్రాక్టర్ చొప్పున ఇసుక తెప్పించి వందలాది ట్రిప్పుల ఇసుకను ఎన్‌టీపీసీ బీఎస్ఎస్‌ఎల్ కార్యాలయ సమీపంలో డంప్ చేసి ప్లాంట్‌కు తరలించారని ప్రభుత్వ యంత్రాంగం గుర్తించింది. ఇసుక అక్రమ దందాపై సుమోటో కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం.

నేడు ఇసుక డంప్‌ల వేలం
సీజ్ చేసిన ఇసుక డంప్‌లను శుక్రవారం వేలం వేయనున్నట్టు తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ పేర్కొన్నారు. జనగామ, సంజయ్‌గాంధీనగర్, సప్తగిరికాలనీల్లో 180ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశామని, ప్రభుత్వం నిర్ణయించిన ధర, చార్జీలను లెక్కించివేలం వేస్తామన్నారు.

చేనేత రంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి



సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ దాసరి వేణు తెలిపారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహించారు. చేనేత కార్మికులతో కలెక్టరేట్ మెయిన్ గేట్ నుంచి సమావేశ మందిరం వరకు ర్యాలీ నిర్వహించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుగ్రహీతలైన చేనేత కార్మికులు, సీనియర్ నేతన్నలను అదనపు కలెక్టర్ సన్మానించి, మెమోంటో అందజేశారు. ఆయన మాట్లాడుతూ చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగాల్లో వాడే యూనిఫామ్, స్కూలు పిల్లల దుస్తులు, మహిళ సంఘాలకు అందించే చీరలను చేనేత కార్మికుల వద్ద ఆర్డర్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. చేనేత రంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలిచిన పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందించారు. జడ్పీ సీఈఓ నరేందర్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న కార్యదర్శి



పొత్కపల్లిలో ఆక్రమించిన ప్రభుత్వ భూమి

ఓదెల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పొత్కపల్లిలో 666 సర్వేనెంబర్‌లో గ్రామపంచాయతీ భూమి ఆక్రమించి గురువారం నిర్మాణాన్ని చేపడుతుండగా కార్యదర్శి ఆర్.కుమారస్వామి అడ్డుకున్నారు. ఈ భూమి ఆక్రమణకు గురైనట్లుగా బీజేపీ నాయకుడు రమేష్ కలెక్టర్‌తో పాటు కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశం మేరకు ప్రభుత్వ భూమిలో చేపట్టిన పనులను కార్యదర్శి అడ్డుకున్నారు. ఇదే సర్వే నెంబర్ లో 32 గుంటలు గ్రామపంచాయతీ భూమి ఉండాలని, సర్వేయర్‌తో కొలిపించి హద్దులు ఏర్పాటు చేయాలని, నిర్లక్ష్యం చేస్తే గ్రామంలోని విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని రమేష్ కలెక్టర్ వాట్సాప్‌కు ఫిర్యాదును పోస్ట్ చేశారు. హద్దులు ఏర్పాటు చేసే వరకు ఎలాంటి నిర్మాణం చేపట్టవద్దని కార్యదర్శి హెచ్చరించారు. దీంతో అక్కడ చేపట్టిన పనులు నిలిచిపోయాయి.

ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రాజెక్టు వైఫల్యాలపై సీఎండీ సీరియస్
- ప్రాజెక్టు హెడ్ రాజీవ్ గుల్బేపై బదిలీ వేటు
- ప్రాజెక్టు ఇన్‌చార్జిగా రమేష్ ఠాకూర్

7

ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచండి



కొలనూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీ హర్ష

ఓదెల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లకుండ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కొలనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ, ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యతో పాటు గర్భిణులకు ఏఎంసీ రిజిస్ట్రేషన్లు వందశాతం చేయాలని సూచించారు. అలాగే ఆసుపత్రి పైకప్పు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని కోరారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్యంతో పాటు పిల్లల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సంక్షేమ అధికారి వేణుగోపాల్, పి.హెచ్.సి. డాక్టర్ తోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్- చిన్నరాత్‌పల్లి
పాతదారి పునరుద్ధరించాలి
- తగ్గనున్న ప్రయాణ భారం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చిన్నరాత్‌పల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ పాత దారి పునరుద్ధరించాలని మండలంలోని చిన్నరాత్‌పల్లి, పెద్దరాత్‌పల్లి, ఇదిలాపూర్, కాల్వశ్రీరాంపూర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో చిన్నరాత్‌పల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ ద్వారా గంగారం, కూనారం, పెగడపల్లి, పెద్దపల్లి, సుల్తానాబాద్, కరీంనగర్ తదితర గ్రామాలకు వెళ్ళేందుకు దారి ఉండేది. 20 ఏళ్ల క్రితం ఈ దారి ఎన్నో గ్రామాలకు ఉపయోగకరంగా ఉండేది. చిన్నరాత్‌పల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ పాత దారి పునరుద్దరిస్తే కేవలం రెండు కిలోమీటర్ల దూరమే ఈ రెండు గ్రామాల మధ్య ఉంటుంది. గతంలో చిన్నరాత్‌పల్లి నుంచి మొట్లపల్లి క్రాస్‌రోడ్డు నుంచి పోలీస్‌స్టేషన్ వరకు తారురోడ్డు నిర్మించారు. సుమారు ఈ రహదారి ఆరు కిలోమీటర్ల పైన ఉంటుంది. కాల్వశ్రీరాంపూర్ నుంచి చిన్నరాత్‌పల్లికి ఈ తారురోడ్డుపై చుట్టు తిరిగి పోవాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో కాల్వశ్రీరాంపూర్ ప్రజలు ప్రభుత్వాసుపత్రి, రెవెన్యూ తదితర కార్యాలయాలకు, ముత్తారం మండలం పారుపల్లి, శాలగుండపల్లి, ముత్తారం, అడవిశ్రీరాంపూర్ ప్రజలు కూడా ఈ పాతదారి గుడా వచ్చి పోయేవారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఉన్నత పాఠశాలలు లేని గ్రామాల విద్యార్థులు కూడా ఈ దారి గుండా కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్లి చదువుకునే వారన్నారు. కాల్వశ్రీరాంపూర్ నుంచి చిన్నరాత్‌పల్లి వరకు సుమారు కిలోమీటర్ వరకు ఉంటుందని, ప్రస్తుతం దారి లేనికారణంగా ఈ దారి వెంట వాహనాలు నడవడం లేదు. కాల్వశ్రీరాంపూర్, చిన్నరాత్‌పల్లి గ్రామాల్లో పొలాలు కూడా కలిసిపోయే ఉంటాయి. కాల్వశ్రీరాంపూర్ నుంచి మంథని, బేగంపేట, గోదావరిఖని తదితర పట్టణాలకు గ్రామాలకు వెళ్లేందుకు ఈ దారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దీనికి సరైన రహదారి నిర్మాణం చేపట్టి దూర భారం తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.




కాల్వశ్రీరాంపూర్ నుంచి చిన్నరాత్ పల్లికి వెళ్లే దారి

దారి బాగు చేయాలి
- సల్లాల రాములు, చిన్నరాత్‌పల్లి



కాల్వశ్రీరాంపూర్ దారి బాగు చేస్తే మా గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు మండల కేంద్రం దగ్గరవుతుంది. కేవలం చిన్నరాతుపల్లి నుంచి మండల కేంద్రం రెండు కిలోమీటర్ల వరకే ఉంటుంది. దారి బాగులేక చుట్టు తిరిగి వస్తుంది. ఈ పాతదారికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

ప్రభుత్వం తారు రోడ్డు మంజూరు చేయాలి
- ఆషాడపు సురేష్, కాల్వశ్రీరాంపూర్



కాల్వశ్రీరాంపూర్ నుంచి చిన్నరాత్‌పల్లి కేవలం రెండు కిలోమీటర్ల దూరమే ఉంటుంది. మట్టి రోడ్డుతో ఇబ్బందిగా ఉంది. ఒక కిలోమీటర్ వరకు రహదారి అస్తవ్యస్తంగా ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి తారు రోడ్డు వేస్తే ఈ రహదారి అన్ని గ్రామాలకు దగ్గరవుతుంది.

గద్దర్ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయండి

హుజూరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో శుక్రవారం జరిగే గద్దర్ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శనిగరం బాబ్జీ అన్నారు. గురువారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పీడిత, తాడిత ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గద్దర్‌కు ఘన నివాళులర్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్, ప్రధానవక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాసిం హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి రచయితలు, కళాకారులు, కవులు, మేధావులు, విద్యా వంతులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అనిల్ కుమార్, వెంకన్న, సుధాకర్, విజయేందర్, రాజన్న, తిరుపతి, రహీం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ గ్రామంలో గురువారం ఆటో-బైకు ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులోని జూపాక క్రాస్‌రోడ్డు వద్ద హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్తున్న బైక్‌ను ఆటో ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో ఆరుషి, పద్మ, సాయికృష్ణ, లక్ష్మి, తిరుపతికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు తప్పని నిరీక్షణ



- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 105.50 కోట్లు
- ఊసేలేని వన్‌టైం సెటిల్‌మెంట్

గణేశ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాసంవత్సరం ముగిసినా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వక పోవడంతో ఇతర కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫీజులు కడితే కాని సర్టిఫికెట్లు ఇవ్వబోమని చెప్పడంతో పేద విద్యార్థులు ఆందోళన చెందు తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రైవేట్ కళాశాలలకు వన్‌టైం సెటిల్ మెంట్ చేస్తామని గత ఏడాది ప్రభుత్వం హామీ ఇచ్చింది. సంవత్సరం దాటుతున్నా బకాయిల చెల్లింపులు లేకపోవడంతో విద్యాసం స్థల యాజమాన్యాలు, విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఫీజు రీయిబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 105.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి సుమారు 30 నుంచి 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2022- 23, 2023-24, 2024-25, సంవత్సరాలకు సంబంధించి బీసీ, ఈబీసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్నది. సుమారు 35 వేల మంది బీసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఇందు లో ఎక్కువ శాతం మంది ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్నారు. వీరికి రెండేళ్లుగా రూ.77 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్సీ విద్యార్థులకు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. సూమారు మూడు వేల మంది విద్యార్థులకు రూ. 16.28 కోట్లు విడుదల కావాల్సి ఉంది. 2,429 మంది ఎస్టీ విద్యార్థులకు సంవత్సరం కాలంగా సుమారు రూ.7.80కోట్లు, మైనార్టీ విద్యార్థులకు రూ.4.50 కోట్లు పెండిం గ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కావడం లేదు. నెల నెలా విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్ కూడా విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆందోళన చెందుతున్న విద్యార్థులు

నిధుల కొరతతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని కళాశాలల్లో యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడంతో ఆందోళన చెందుతున్నారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి కాగితాలు రాయించుకుని ఫీజు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు విడుదల చేసిన తర్వాత తిరిగి తమకు చెల్లిస్తామని చెపుతున్నారని విద్యార్థులు అంటున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమౌంట్ ఎస్సీ విద్యార్థులకు నేరుగా వారి అకౌంట్‌లోకి జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపే ప్రయత్నం చేస్తుండగా, ఈ కొత్త విధానంతో మరో సమస్య వచ్చి పడుతుందని ఇటు విద్యార్థులు, అటు యాజమాన్యాలు తలలు పట్టుకుంటున్నాయి.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ఎన్నం ప్రకాష్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర వ్యాప్తంగా మూడు సంవత్సరాలుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. వెంటనే పాత బకాయిలు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి. లేని పక్షంలో ప్రభుత్వంపై ఉద్యమిస్తాం.

బకాయిలు చెల్లించి కొత్త విధానం అమలు చేయాలి

కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



2024-25 విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ విద్యార్థులకు వారి ఖాతాల్లో నేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేయడం బాగుంది. కానీ బకాయిలను విడుదల చేసిన తర్వాతనే కొత్త విధానం అమలు చేయాలి.

ప్రైవేటు కళాశాలలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదు..

చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘం నాయకుడు



ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీల తో పాటు బీసీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థుల ఖాతాలో నిధులు జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి.

శతాధిక వృద్ధురాలు మృతి



మీరిబాయి(ఫైల్)

రుద్రంగి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల బడితండా గ్రామంలో మీరిబాయి(120) అనే శతాధికవృద్ధురాలు అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మీరిబాయికి నలుగురు కుమారులు, కూతురు కాగా, 105 మంది మనుమళ్లు, మనుమరాళ్లు, మునిమనుమలు ఉన్నారు. ఇప్పటివరకు మీరిబాయి తన పనులు తానే చేసుకుంటుండేదని, 15 రోజులుగా వృద్ధురాలు అనారోగ్యం బారిన పడటంతో మృతిచెందినట్లు తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలు భరించలేక వంగల దేవరెడ్డి(70) అనే వృద్ధుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని దేవరెడ్డి కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. వ్యవసాయ పనులు చేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడం. అనారోగ్య సమస్యలు అధికమవడం వల్ల జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు. మృతుడికిభార్య విజయ, కొడుకు రవీందర్‌రెడ్డి, కూతురు రజిత ఉన్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



రంజిత్(ఫైల్)

జూలపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన ఐలవేని రంజిత్(25)గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం మధ్యాహ్నం గ్రామంలోని ఒక బెల్టుషాపులో మద్యం సేవించేందుకు వెళ్లాడు. బెల్టుషాపులో డబ్బును దొంగతనం చేశాడని నిర్వాహకులు రంజిత్‌ను ప్రశ్నించారు. డబ్బులు దొంగలించలేదని తెలిపినా నిర్వాహకులు వినలేదు. దుస్తులు విప్పి చూపించాలనడంతో రంజిత్ దుస్తులను విప్పినట్లుగ్రామస్థులు, కుటుంబసభ్యులుపేర్కొన్నారు. ఈ విషయమై తీవ్ర మనస్తాపానికి గురైన రంజిత్ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సాయంత్రం రంజిత్‌అన్న గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ పేర్కొన్నారు.

బొమ్మనపల్లిలో చైన్ స్నాచింగ్

చిగురుమామిడి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలోగల ఓ ప్రైవేట్‌పాఠశాల వద్ద గురువారం సాయంత్రం మహిళ మెడ నుంచి మూడు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఆయనతెలిపిన వివ రాలిలా ఉన్నాయి.. హుస్నాబాద్ నుంచి సైదాపూర్ వైపు ద్విచక్ర వాహ నంపై ధనలక్ష్మి, ఆమెభర్త ప్రకాశ్‌తో కలిసి వెలుతోంది. వారిని వెంబడిస్తూ మరో ద్విచక్రవాహనంపై వచ్చిన ఆగంతకుడు ధనలక్ష్మి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును అపహరించినట్లు తెలిపారు. బాధి తురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశామన్నారు. సంఘటన స్థలం సమీపంలో ఉన్నపాఠశాల సీసీపుటేజీలను పరిశీలించినట్లుఎస్సై తెలిపారు.

వెంకటాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అతివేగం, అజాగ్రత్తగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన కామారెడ్డి జిల్లాకు చెందిన సంతోష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కంటి వైద్యుడు శ్రీనివాస్ తన కారులో సిరిసిల్ల నుంచి వెంకటాపూర్ మీదుగా ముస్తాబాద్ వెళ్లి తిరుగు పయనమయ్యాడని పేర్కొన్నారు. సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపుకు వెళ్తున్న సంతోష్ అతివేగంగా దూసుకు వచ్చి ఎదురుగా వస్తున్న శ్రీనివాస్ కారును ఢీకొట్టాడు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య కార్మికురాలిపై లైంగిక వేధింపులు

కోల్‌సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికురాలిని పనిస్థలంలో లైంగికంగా వేధింపులకు గురిచేశాడనే ఫిర్యాదుపై సూపర్‌వైజర్ తాజుద్దీన్‌పై గురువారం కేసు నమోదుచేసినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. బాధితురాలిని కొంతకాలంగా తాజుద్దీన్ వేధిస్తున్నాడని పేర్కొన్నారు. బుధవారం పనులు కేటాయించే సమయంలో నీ సంగతి చూస్తానని, నిన్ను రోడ్డు మీద నిలబెడతానంటూ అసభ్యపదజాలంతో దూషించినట్టు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

ఇయర్ ఫోన్స్ ఎంత పనిచేశాయి..

- పాటలు వింటూ ఒకరు.. ఫోన్ చూస్తూ మరొకరు
- రైలు పట్టాలపై వెళుతుండగా ప్రమాదం
- ఇద్దరు యువకుల దుర్మరణం

మధ్యప్రదేశ్‌కు చెందిన దిలీప్‌కుమార్, ఆకలేష్ శ్రీరాంవార్ఘడే వరసకు బావ,బామమరుదులు.. జమ్మికుంట మండలం మడపల్లి రైల్వేగేట్ సమీపంలోని సిమెంట్‌బ్రిక్స్ కంపనీలో పనిచేసేందుకు వచ్చారు. తమ బ్యాగులు కంపెనీ ఆవరణలో పెట్టి సమీపంలో రైల్వే ట్రాక్ వైపు వెళ్లారు. ఆకలేష్ శ్రీరాం వార్ఘడే ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటూ.. దిలీప్‌కుమార్ ఫోన్ చూస్తూ ట్రాక్‌పై నడుస్తున్నారు. ఆ ప్రాంతంలో ట్రాక్ వంపుగా ఉంటుంది. వెనక నుంచి వచ్చిన రైలును వారు గమనించలేదు. వేగంగా వచ్చిన రైలు ఇద్దరు యువకులను ఢీకొని వెళ్లిపోయింది. ఉపాధి కోసం వచ్చిన ఇద్దరు యువకుల జీవితాలు అర్ధాతరంగా ముగిశాయి.



దిలీప్ కుమార్, ఆకలేష్ శ్రీరాం వార్ఘడే (ఫైల్)

జమ్మికుంట/జమ్మికుంట రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలోని మడిపల్లి కెనాల్ రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మధ్యప్రదేశ్‌లోని చిఖిలి గ్రామానికి చెందిన దిలీప్ కుమార్(25), మహారాష్ట్రలోని సీతపర్ గ్రామానికి చెందిన ఆకలేష్ శ్రీరాం వార్ఘడే(25) మృతి చెందారు. వీరిద్దరూ మడిపల్లి రైల్వేగేట్ సమీపంలో ఉన్న సిమెంట్ బ్రిక్స్‌లో పనిచేసేందుకు మంగళవారం సాయంత్రం వచ్చారు. తమవెంట తెచ్చుకున్న బ్యాగులను సిమెంట్‌బ్రిక్స్ కంపెనిలో పెట్టారు. బహిర్భూమికి వెళ్లొస్తామని సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లారు. ఆకలేష్ శ్రీరాం వార్ఘడే చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని, దిలీప్‌కుమార్ ఫోన్ చూస్తూ ట్రాక్‌మీద నడుచుకుంటూ వెళ్లారు. గుర్తుతెలియని రైలు వారిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అటువైపు వెళుతున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్ స్టేషన్ మాస్టర్‌కు ఫోన్‌చేసి రైల్వేట్రాక్ పక్కన రెండు మృతదేహాలు కనిపిస్తున్నాయని సమాచారం అందించాడు. ట్రాక్‌మన్ అక్కడ వెళ్లి ఇద్దరు యువకుల మృతదేహాలు ఉన్నట్లు గుర్తించి రైల్వే పోలీస్‌లకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీస్‌లు పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మడిపల్లి కెనాల్ వద్ద రైల్వే ట్రాక్ వంపుగా ఉంటుంది. ఆ ప్రాంతంలో రైలు సమీపంలోకి వచ్చే వరకు కనిపించదు. ఇద్దరు యువకులు ఫోన్‌లో నిమగ్నమై ఉండడంతో ప్రమాదం జరిగి ఉంటుందని రైల్వే పోలీస్‌లు భావిస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా పూర్తి చేసి మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే ట్రాక్‌ల వద్దకు ప్రజలు వెళ్లొద్దని, వెళ్లినా అప్రమత్తంగా ఉండాలని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి తిరుపతి సూచించారు. మడిపల్లి కెనాల్ వద్ద ట్రాక్ వంపుగా ఉండడంతో ఆ ప్రాంతంలో రైళ్ల సమీపంలోకి వచ్చేవరకు ఏర్పడదని, ఇటువైపు వచ్చే వారు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

రోడ్డుపై ఇరుక్కుపోయిన స్కూల్ బస్, లారీ

జమ్మికుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కూరగాయల మార్కెట్‌రోడ్డులో స్కూల్ బస్ వెంట్రుక సందులో ఇరుక్కుపోయాయి. దీంతో 15నిమిషాల పాటు రెండు వాహనాలు ఎటూ కదలకుండా ఉండిపోయాయి. ఇరువైపులా వాహనాలు నిలిచి రాకపోకలకు తీవ్రఅంతరాయం కలిగింది. ఇతర వాహనదారుల సూచన మేరకు ఇద్దరు డ్రైవర్లు ఒకదానికి మరొకటి తగలకుండా వాహనాలను ముందుకు తీసుకెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భారీవాహనాలు ఇరుకు రోడ్డు గుండా రాకుండా పోలీస్‌లు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



మార్కెట్ రోడ్డులో ఇరుక్కుపోయిన స్కూల్ బస్, లారీ

30 తులాల బంగారం చోరీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వివేకానంద పురి కాలనీలోని భార్గవ్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో ఓఫ్లాట్‌లో బుధవారం అర్ధ రాత్రి దొంగలుచొరబడి 30తులాల బంగారం అపహరించుకు పోయారు. కరీంనగర్ మూడోటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గంధం వేదవ్యాస్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌లో కొద్దిరోజులుగా రంగులు వేస్తుండటంతో ఆయన కుటుంబం శ్రీపురంకాలనీలో ఉంటున్నారు. ఉదయం నుంచిసాయంత్రం వరకు ప్లాట్‌లో ఉంటూ రాత్రి శ్రీపురంకాలనీ ఇంటికి వెళ్లిఅక్కడే నిద్రిస్తున్నారు. బుధవారం రాత్రి 9గంటలకు ఫ్లాట్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లిన వేదవ్యాస్‌కు గురువారం ఉదయం అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండేవ్యక్తి ఫోన్‌చేసి తాళం పగులగొట్టి ఉందని సమాచారం ఇచ్చాడు. వెంటనే వెళ్లి చూడగా బీరువా తెరచి బట్టలు, ఇతరవస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలోని 30తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు.

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో తాళం వేసి ఉన్న మరాఠి లక్ష్మి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్ఐ రాహుల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని లక్ష్మి భర్త నాలుగేళ్ల కిందట చనిపోవడంతో ఇంటిలో ఒంటరిగా జీవిస్తోంది. గతనెల 30న సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులో ఉంటున్న తన తల్లిగారింటికి వెళ్లింది. ఈనెల 6నరాత్రి ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి తాళం పగులకొట్టి కనిపించింది. బీరువా ధ్వంసమవడంతోపాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.5వేల నగదు, రూ.12.5వేల విలువైన బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామ శివారులో గురువారం ట్రాక్టర్‌ను పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌లపై కేసునమోదుచేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు

బొంపల్లిలో గంజాయి పట్టివేత

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి శివారులోఆటోలో ముగ్గురువ్యక్తులు గంజాయిని తీసుకెళ్తుండగా పెద్దపల్లి రూరల్‌పోలీసులు పట్టుకున్నారు. రూరల్‌ఎస్ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన అస్లాం, ఫయాజ్, ఖాజా అనే ముగ్గురు జిల్లాకేంద్రం నుంచి గుర్తుతెలియని వ్యక్తినుంచి 100గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి ఆటోలో బొంపల్లి మీదుగా కరీంనగర్ వెళ్తుండగా రూరల్ పోలీసులు తనిఖీ చేశారు. గంజాయి స్వాధీనం చేసుకొని ఆటోతో పాటు ముగ్గురుని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

ఒకే రోజు తండ్రీకొడుకు మృతి

- అనారోగ్యంతో తండ్రి.. ఆత్మహత్య చేసుకుని కొడుకు..
- జగిత్యాల జిల్లా సోమన్‌పల్లి గ్రామంలో విషాదం



తిరుపతి, వెంకన్న(ఫైల్)

జగిత్యాలరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా జగిత్యాలరూరల్ మండలం సోమన్‌పల్లి గ్రామంలో గురువారం తండ్రీకొడుకు ఇద్దరూ ఒకేరోజు మృతి మృతిచెందడంతో విషాదం అలుముకుంది. గురువారం తెల్లవారు జామున చంద వెంకన్న(65) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి అంత్యక్రియలకు ఏర్పాటు చేస్తుండగా తీవ్ర మనస్థాపంతో అతని కుమారుడు చంద తిరుపతి (31) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్, గ్రామస్థుల కథనం ప్రకారం చంద వెంకన్న కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఆరోగ్యం క్షీణించి గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. తిరుపతి తన తండ్రి మృతితో మనస్థాపం చెంది తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనితో వెంకన్న మనమడు అతనికి అంత్యక్రియలు నిర్వహించాడు. రెండు గంటల అనంతరం కొడుకు తిరుపతి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే రోజు తండ్రీకొడుకు మృతిచెందడంతో సోమన్‌పల్లి గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. గతంలో వెంకన్న పెద్దకుమారుడు రవి దుబాయ్‌లో హత్యకు గురయ్యాడు. తిరుపతి భార్య చంద సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు. తిరుపతికి రూ.5లక్షల వరకు అప్పులు ఉన్నాయనిచ ఒక వైపు తండ్రి మరణం కుంగదీయగా, అప్పులు ఎలా తీర్చలనే వేదనతో ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది.

కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రన్నర్స్ సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 12న నిర్వహించనున్న మూడవ ఎడిషన్ ఆఫ్ కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గతరెండు మారథాన్‌లను విజయవంతంగా నిర్వహిం చిన రన్నర్స్ సైక్లిస్ట్ అసోసియేషన్‌ను అభినందించారు. ఈసంవత్సరం కూడా అందరూ పాల్గొనాలన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన తీసుకువస్తున్న కరీంనగర్ రన్నర్స్ సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ హాఫ్‌మారథాన్‌లో మూడు కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 21 కిలోమీటర్ల పరుగు ఉంటుందని ఈ సందర్భంగా హాఫ్ మారథాన్ నిర్వాహకులు పసుల మహేష్ తెలిపారు. ఈ మారథాన్‌లో పాల్గొనే వారందరూ karimnagarmarathon.com వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ

గణేశ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ద్వారా ఎస్సారార్ కళాశాల ఫైనల్‌ఇయర్ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. 21శతాబ్దపు ఉద్యోగ నైపుణ్యాలను కళాశాల డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అందించడానికి మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. కళాశాలలో ఆగస్టు11వతేదీ నుంచి 12రోజులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం సృజన్‌దాస్, మ్యాజిక్‌బస్ ఇండియా శిక్షకురాలు పూర్ణశ్రీ, వైస్‌ప్రిన్సిపల్ నితిన్‌పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బీసీ గర్జన సభ వాయిదా

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో శుక్రవారం జరుపనున్న బీసీ గర్జనసభ వాయిదాపడింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిజిల్లాలో బీసీగర్జన సభలు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించి, మొదట 8న కరీంనగర్‌లో సభ ఏర్పాటుకు సన్నాహాలు చేసింది. అయితే వర్షాల కారణంగా సభను వాయిదా వేశామని బీఆర్ఎస్ నాయకత్వం ప్రకటించింది. కరీంనగర్‌లో ఈనెల14న బీసీగర్జన సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నది.

వృద్ధురాలి దారుణ హత్య

- కర్ర, బండ రాయితో మోది నీరు లేని బావిలో పడేసిన వైనం



ప్రేమలత(ఫైల్)

జగిత్యాల క్రైం/కొడిమ్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలో మెన్నేని ప్రేమలత(70) అనేవృద్ధురాలు బుధవారం రాత్రి దారుణహత్యకు గురైంది. ప్రేమలత బుధవారం జగిత్యాలకు వెళ్లి రాత్రి తిరిగిఇంటికి వస్తుండగా కర్ర, బండరాయితో మోది హత్యచేసిన దుండగులు మృతదేహాన్ని ఆమెఇంటి సమీపంలోని నీరులేని బావిలో పడేయడం కలకలంరేపింది. గురువారం తెల్లవారు జామున గ్రామస్థులు మృతదేహాన్ని చూడడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తమ పొరుగింటి వారిని దూషించిదనే కారణంతోనే ఈ దారుణం చోటుచేసుకున్నట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ప్రేమలతకు ముగ్గురు కుమారులు కాగా పెద్దకుమారుడు కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు మెన్నేని రాజనర్సింగరావు. ప్రేమలత ఒంటరిగానే నాచుపల్లి గ్రామంలో ఉన్నతన ఇంట్లో నివసిస్తోంది. ప్రేమలత ఇంటి సమీపంలో రఘునందన్‌రావు అనేవ్యక్తి డెయిరీ, ఫౌల్ట్రీ ఫాం నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. కొద్దిరోజులుగా ప్రేమలతకు, రఘునందన్‌రావుకు మధ్య దూషణ జరిగినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా రఘునందన రావును ఆమెదూషించి నందువల్లే ఆమెను హత్యచేశారని అనుమానిస్తున్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అరీఫ్ అలీఖాన్, మల్యాల సీఐరవి, కొడిమ్యాలఎస్సై సందీప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ బృందంతో పాటు ఫింగర్‌ప్రింట్ పోలీసులు పలు ఆధారాలు సేకరించారు. మృతురాలి కోడలు, మాజీఎంపీపీ మెన్నేని స్వర్ణలత గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

మత్తులో విద్యార్థి హల్‌చల్..

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మత్తులో ఓ విద్యార్థి హల్‌చల్ చేసిన సంఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపంలోని ఓ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి ద్విచక్రవాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ మరో విద్యార్థి వాహనాన్ని ఢీకొన్నాడు. దీనితో ఇద్దరు విద్యార్థుల మధ్య మాటామాటా పెరిగి దుర్భాషలాడుకున్నారు. ట్రిపుల్‌రైడింగ్ చేస్తూ వచ్చిన విద్యార్థులు మరో విద్యార్థిపై దాడిచేశారు. దాదాపు అరగంటపాటు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సిరిసిల్ల పాతబస్టాండ్‌లో మత్తులో ప్రతిరోజు కొందరు పోకిరీలైన విద్యార్థులు ద్విచక్రవాహనాలపై రైడింగ్ చేస్తూ అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారు.

ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల



వరద కాలువలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు

జగిత్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు అవసరాల కొరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్ద కాకతీయ కాలువ ద్వారా సాగునీటి సరాఫరాను తెలంగాణ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అవినాశ్ రెడ్డి, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. వానాకాలం సాగు సీజన్‌కు గానూ ఎస్సారెస్పీ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా వారాబందీ పద్ధతిలో సాగునీటి సరాఫరా కొనసాగించనున్నట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ అధికారులు గణేష్, కొండ వంశీ, విన్యాస్‌రెడ్డి, డీఈఈలు, ఏఈఈలు, టీఎస్ జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 2,153 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 40.582 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 46.654 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆర్ఎఫ్‌సీఎల్ వైఫల్యాలపై సీఎండీ సీరియస్

- ప్రాజెక్టు హెడ్ రాజీవ్ గుల్బేపై బదిలీ వేటు
- ప్రాజెక్టు ఇన్‌చార్జిగా రమేష్ ఠాకూర్

కోల్‌సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్‌లో వరుస వైఫల్యాలపై యాజమాన్యం సీరియస్‌గా స్పందించింది. ఆర్ఎఫ్‌సీఎల్ సీఎండీ సర్వనన్ ఇటీవల జరిగిన అమ్మోనియా లికేజీ ఉదంతాలను సీరియస్‌గా తీసుకున్నారు. దేశంలో యూరియా అవసరమైన సమయంలో ప్రాజెక్టులో అమ్మోనియా లీకేజీతో 18రోజులు షట్‌డౌన్ కావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో యూరియా కొరత ఏర్పడింది. తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు కేంద్రానికి లేఖలు రాశారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ నేరుగా కేంద్ర ఎరువుల శాఖమంత్రినే లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు గుప్పించారు. ఈ పరిస్థితుల్లో రామగుండం ఎరువుల కర్మాగారానికి కమిటీని పంపి సీఎండీ విచారణ జరిపించారు. ఈ కమిటీ నివేదిక మేరకు ఏకంగా ప్రాజెక్టు హెడ్ రాజీవ్ గుల్బాపైనే వేటువేసినట్టు తెలుస్తోంది. ఆయనను ఎన్ఎఫ్ఎల్ హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేసి, ఆయన స్థానంలో ఆర్ఎఫ్‌సీఎల్‌లో మెకానికల్ డీజీఎంగా పనిచేస్తున్న రమేష్‌ఠాకూర్‌కు ప్రాజెక్ట్ హెడ్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. జూలై 1వ తేదీనే రాజీవ్ గుల్బా ఆర్ఎఫ్‌సీఎల్ హెడ్‌గా బాధ్యతలు స్వీకరించారు. నెల రోజులకే బదిలీ చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఇప్పటికే కేంద్ర కార్యాలయానికి ప్లాంట్‌కు మధ్య సమన్వయం కొరవడిందనే ఆరోపణలున్నాయి. నిర్ణయాలు త్వరగా జరగకపోవడంతో ప్లాంట్‌పై ప్రభావం పడుతోంది. ఇప్పటికైనా యాజమాన్యం పూర్తిస్థాయిలో ఆర్ఎఫ్‌సీఎల్‌పై దృష్టి పెడుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో పాల్గొన్న యువతులు, తండావాసులు

చందుర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం దేవుని తండాలో తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతులు గోధుమలను బుట్టలో వేసి తొమ్మిది రోజులు నియమనిష్టలతో ఉపవాసం ఉన్నారు. అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించి, చివరి రోజు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, తండా వీడీసీ అధ్యక్షుడు అజ్మీరా గణేష్, నాయకులు గబ్బర్ సింగ్, భక్తులు, తండా వాసులు, పాల్గొన్నారు.

గురుకుల టెండర్లలో అయోమయం



- టెండర్ల ఫారం ధర నిర్ణయించని ప్రభుత్వం
- ఒక్కో జిల్లాలో ఒక్కో ధర..
- పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లో రూ. 25 వేలు
- మిగతా జిల్లాల్లో రూ. 2 వేల నుంచి 10 వేల వరకు
- ఏకీకృత విధానంలో టెండర్లు అంటూ వేర్వేరు ధరలా?
- నిబంధనలు సవరించాలంటున్న కాంట్రాక్టర్లు
- లేకుంటే 12 నుంచి సరుకుల సరఫరా, క్యాటరింగ్ బంద్ చేయాలని నిర్ణయం

పెద్దపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలకు ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్ సరఫరాతోపాటు క్యాటరింగ్ చేసేందుకు కామన్ టెండర్లను ప్రభుత్వం ఆహ్వానించింది. అయితే ప్రభుత్వం టెండర్ ఫారాల ధరలను ఖరారు చేయలేదు. దీంతో ఆయా జిల్లాల కలెక్టర్లు తమకు తోచిన విధంగా ధరలను నిర్ణయించి టెండర్ నోటీసులు జారీ చేశారు. అత్యధికంగా పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కో టెండర్ ఫారం ధర 25 వేల రూపాయలు, మిగతా జిల్లాల్లో 2 వేల నుంచి 10 వేల రూపాయలు నిర్ణయించారు. కరీంనగర్ జిల్లాలో రూ.2 నుంచి 5 వేలు, ములుగు జిల్లాలో రూ.10 వేలు, నాగర్‌కర్నూల్, నారాయణపేట్ జిల్లాల్లో రూ.2 వేలు, హైదరాబాద్ జిల్లాలో రూ.3 వేలు, జగిత్యాల జిల్లాలో రూ.5 వేల ధర



నిర్ణయించారు. దీంతో కాంట్రాక్టర్లు ఇదేమి విధానం అంటూ ప్రశ్నిస్తున్నారు. అలాగే జిల్లా యూనిట్‌గా ఆహార పదార్థాలు (కిరాణ సరుకులు), మండల యూనిట్‌గా కూరగాయలు-పండ్లు, మటన్-చికెన్, క్యాట రింగ్ టెండర్లను ఆహ్వా నించింది. జిల్లా, మండల యూనిట్లకు వేర్వేరుగా టెండర్లు దాఖలు చేయాలనుకునే ఒక కాంట్రాక్టర్ ఒకే ఫారంలో దరఖాస్తు చేయాలా లేక వేర్వేరుగా టెండర్ దాఖలు చేయాలా అనే విషయమై స్పష్టత లేకపోవ డంతో కాంట్రాక్టర్లు అయోమయానికి గురవు తున్నారు.

ఏకీకృత విధానంలో టెండర్లు..

రాష్ట్రంలో 1023 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, టీఎస్ రెసిడెన్షియల్ విద్యాలయాలున్నాయి. వీటిలో 6,46,486 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యా భ్యాసం చేస్తున్నారు. గతేడాది వరకు ఆయా సొసైటీలు ఒక్కో గురుకుల పాఠశాల, కళాశాల వారీగా, జిల్లా పర్చేస్ కమిటీల ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించే వారు. వీటితో స్థానికంగా ఉండే కాంట్రాక్టర్లకు, మరి కొందరికి ఉపాధి లభించేది. ఆ విధానానికి బదులు రాష్ట్ర వ్యాప్తంగా కొత్త విధానాన్ని ప్రభుత్వం తీసుక వచ్చింది. మెనూ ప్రకారం ఏఏ సరుకులను సరఫరా చేయాలనే విషయమై ఏకీకృత విధానాన్ని తీసుక వచ్చింది.

జిల్లా పర్చేస్ కమిటీల ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లో ఉన్న గురుకుల విద్యాలయాలకు కలిపి ఆహార పదార్థాలు (కిరాణ సరుకులు) జిల్లా యూనిట్‌గా, కూరగాయలు-పండ్లు, మటన్-చికెన్, క్యాటరింగ్ కోసం మండల యూనిట్‌గా టెండర్లను ఆహ్వానించారు. ఆహార పదార్థాల్లో వంట నూనె, పాలు మినహాయించారు. నూనె, పాలు విజయ సంస్థలకు అప్పగించగా, కోడి గుడ్ల టెండర్లు జిల్లాల వారీగా నడుస్తు న్నాయి. ఈ టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లు ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ రిజిస్ట్రేషన్, ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్, ఐటీ రిటర్న్స్, టర్నోవర్, అనుభవం చూపె ట్టాలి. ఇవేమి లేకుండా మండల సమా ఖ్యలు, యువజన బృం దాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఒక్కో జిల్లాలో అన్ని సొసైటీలకు సం బంధించి 10 నుంచి 20కి పైగా గురుకుల విద్యాలయాలున్నాయి.

గత నెల 31 నుంచి టెండర్ నోటిఫి కేషన్లు జారీ కాగా, ఈ నెల 14వ తేదీ వరకు దర ఖాస్తులను స్వీకరించనున్నారు. 23న అర్హుల జాబితా ప్రకటన, 28న కాంట్రాక్టర్లకు ఆర్డర్లు జారీ చేయనున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి క్యాటరింగ్ ఆరంభం కానుండగా, సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ఆహార పదార్థాలు, ఇతరత్రా కొత్త కాంట్రాక్టర్లు సరఫరా చేయనున్నారు. అప్పటి వరకు పాత కాంట్రా క్టర్లు సరుకులు సరఫరా చేయాల్సి ఉంటుంది.

టెండర్ల విధానంపై కాంట్రాక్టర్ల అసంతృప్తి..

టెండర్ల విధానంపై కాంట్రాక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టెండర్ ఫారాల ధరలను అడ్డగోలుగా నిర్ణయించడంపై మండిపడుతున్నారు. రాష్ట్రమంతటా ఏకీకృత విధానంలో టెండర్లు నిర్వహిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అన్ని జిల్లాలకు టెండర్ ఫారం ధర ఒకే విధంగా నిర్ణయించక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కొత్తగా మహిళా మండల సమాఖ్యలు, యువజన సంఘాలకు ప్రాధాన్యం ఇస్తామన్న ప్రభుత్వం రూ.25 వేలు చెల్లించి టెండర్లు వేస్తారా అనేది అనుమానమే. అలాగే జిల్లా యూనిట్‌గా అన్ని గురుకులాలకు ఒక్క కాంట్రాక్టరే ఆహార పదార్థాలను సరఫరా చేయడం సాధ్యం కాదంటున్నారు. టెండర్ వాల్యూపై సంవత్సరానికి 5 శాతం ఈఎండీ చెల్లించాలని, క్యాటరింగ్‌కు 75 వేల రూపాయల ఈఎండీ చెల్లించాలనే నిబంధన విధించడం గుదిబండగా మారనున్నదని కాంట్రాక్టర్లు అంటున్నారు.

గతంలో ఎస్సీ గురుకులాల్లో ఎస్సీలకు ఈఎండీలో 40 శాతం మాత్రమే చెల్లించాలనే నిబంధన ఉండేది. కానీ ఈ టెండర్లలో అలాంటి మినహాయింపులు లేకపోవడం గమనార్హం. ఈ విధానాలపై కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి గురుకులాల టెండర్ల విధానంలో సవరణలు చేయాలని కోరుతున్నారు. లేదంటే ఈ నెల 12వ తేదీ నుంచి అన్ని గురుకులాలకు సరుకుల సరఫరా, కేటరింగ్‌ను నిలిపి వేస్తామని తెలంగాణ గురుకులాల కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రకటించింది. భవిష్యత్ కార్యాచరణపై ఈ నెల 7న గురువారం హైదరాబాద్‌లో సమావేశమవుతున్నారు.

విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసుకోవాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లలో దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపు పూర్తయిందని, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీటు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ రామకృష్ణ తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ టీసీ, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో కళాశాలకు వచ్చి సీటు కన్ఫర్మేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సీటు కన్ఫర్మేషన్ చేసుకోకపోతే సీటు రద్దు అవుతుందని తెలిపారు. శుక్రవారం సీటు కన్ఫర్మేషన్‌కు చివరి తేదీ అని తెలిపారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ ఎన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ఆధ్వర్యంలో డాక్టర్ బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. హుజూరాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, నూకపల్లి నాక్ కేంద్రాల ద్వారా పలువురు నిరుపేద మహిళలను ఎంపిక చేసి నెలరోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, మహిళా శక్తిని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ఫౌండేషన్ ముందుకు సాగుతుందన్నారు. ట్రైనింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రామాణిక శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ రూప్సీ, డాక్టర్ శ్రీదేవి, గంగ, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

జగిత్యాల క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులోని కోదండ రామాలయ ప్రాంతంలో ప్రభుత్వ నిషేధిత గంజాయి కలిగి ఉన్న జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన యువకుడిని జగిత్యాల టౌన్ ఎస్సై కుమారస్వామి పట్టుకున్నారు. అతని వద్ద 105 గ్రాముల గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పింఛన్లు పెంచకపోతే సీఎంను గద్దె దించుడే..

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

హుజూరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లు పెంచకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గద్దె దింపుడు ఖాయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల దివ్యాంగులు, వృద్ధుల పింఛన్‌దారుల సన్నాహకసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు, వృద్ధులకు పింఛన్లు ఇవ్వకపోతే ప్రతిపక్ష పార్టీలు ముఖ్యమంత్రిని నిలదీయాలన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటఇచ్చిన ప్రకారం అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచారన్నారు. తెలంగాణలో మాత్రం 20నెలలు దాటినా ఇవ్వడం లేదన్నారు. 13న జరిగే సభ కంటే ముందు పింఛన్లు పెంచకపోతే సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయ ఉరి తప్పదన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా టేబుల్ టెన్నిస్ పోటీలు



టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడుతున్న బాలికలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి అల్ఫోర్స్ పాఠశాలలో రెండురోజులుగా నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. రెండోరోజు గురువారం అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలతో గుర్తింపు లభిస్తుందని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

- రెండో రోజు ఫలితాలు..

అండర్-14 విభాగంలో టీం ఈవెంట్‌లో వీపీఎస్ పబ్లిక్ స్కూల్ టైమ్ స్కూల్‌పై 1 పాయింట్ తేడాతో గెలుపొందింది.

అండర్-17 విభాగంలో శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ 3-0 పాయింట్ల తేడాతో సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్‌పై గెలుపొందింది. అండర్-19 విభాగంలో శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్‌పై 3-0 పాయింట్ల తేడాతో గెలుపొందింది.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి నారాయణ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తారకరామనగర్‌కు చెందిన జగన్నాథం సమ్మయ్య, బల్లని సారయ్యతో పాటు మరికొంత మంది కలిసి నిత్యం తాటిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతుండేవారు. చాలా రోజుల నుంచి సమ్మయ్య పేకాటలో డబ్బులు గెలుస్తూ ఉండేవాడు. ఎలాగైనా పేకాటలో సమ్మయ్యపై గెలవాలని సారయ్యతో పాటు అతని మేనల్లుడుతో కలిసి కోరుట్ల ప్రాంతంతో పేకాట ఆడారు. మరోసారి సమ్మయ్యనే గెలువడంతో అతనిపై సారయ్య కక్ష పెంచుకున్నాడు. పథకం ప్రకారం పేకాట ఆడేందుకు సమ్మయ్యను 2021 ఆగస్టు 28న ద్విచక్ర వాహనంపై తాటిపల్లి గ్రామ శివారులోని పెద్దయ్య చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లి బండరాయితో కొట్టి హత్యకు పాల్పడ్డారు. అనంతరం సమ్మయ్య మృతదేహాన్ని చెరువులో పడేసి వెళ్లిపోయారు.

మృతుడి కుటుంబసభ్యులు జగిత్యాల రూరల్ పోలీసులకు సమ్మయ్య కనబడడం లేదని ఫిర్యాదు చేశారు. తాటిపల్లి గ్రామ శివారులోని చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యంకాగా పోలీసుల విచారణలో మృతదేహాన్ని సమ్మయ్యదిగా గుర్తించారు. హత్యకు పాల్పడ్డ వ్యక్తి సారయ్యతో పాటు అతడి మేనల్లుడు(బాలుడి)గా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ కృష్ణకుమార్, ఎస్సై చిరంజీవి, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, రాజులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సారయ్యకు జీవితఖైదు విధిస్తూ న్యాయ మూర్తి తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడు బాలుడు కావడంతో జువైనల్ కోర్టులో కేసు విచారణ జరుగుతున్నట్లు కోర్టు అధికారులు పేర్కొన్నారు.

చేనేత కాంతిరేఖ

- కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు అందుకున్న వెల్ది రేఖ
- రాజన్న సిరిపట్టు పితాంబరానికి అరుదైన గౌరవం



రేఖకు అవార్డు అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, అవార్డుతో రేఖ

సిరిసిల్ల ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారిణి వెల్ది రేఖ నేసిన రాజన్న సిరిపట్టు పితాంబరం చీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును రేఖ అందుకున్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో చేనేత కళాకారులు అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నారు. అదే బాటలో మహిళా చేనేత కార్మికులు సైతం అద్భుతాలు సృష్టిస్తున్నారు. చేనేత రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదిగా భావించే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును రాష్ట్రంలో అందుకున్న తొలి మహిళగా వెల్ది రేఖ నిలిచింది. చేనేత రంగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ సతీమణి రేఖ చేనేత మగ్గంపై సృష్టించిన రాజన్న సిరిపట్టు పట్టు పీతాంబరానికి ఈ అరుదైన గౌరవం పొందారు. 45 రోజులపాటు శ్రమించి చేనేత మగ్గంపై రూపొందించిన పట్టుచీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఖ్యాతిని తెలియజేసేలా చేనేత దంపతులు హరిప్రసాద్, రేఖలు ఈ పట్టు పీతాంబరాన్ని రూపొందించారు. రూ.36 వేల విలువైన 48 ఇంచుల వెడల్పు, ఐదు మీటర్ల పొడవు, 605 గ్రాముల బరువుతో ఉన్న ఈ పట్టు చీరలో కాకతీయుల శౌర్యానికి గుర్తు అయిన కమాన్‌తో పాటు వేములవాడ రాజన్న కోడె మొక్కులను సూచించే జరీబుటాలను పొందుపరిచారు. సిరిసిల్ల చేనేత వనితనానికి గుర్తుగా నూలు వడుకుతున్న మహిళ బొమ్మతో కూడిన జరీబుటాను పట్టుచీరపై నేసి అబ్బురపరిచారు.

చేనేత రంగంలో నిత్యం ప్రయోగాలే..

సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారులైన వెల్ది హరిప్రసాద్, రేఖ దంపతులు దశాబ్ద కాలంగా నిత్యం ప్రయో గాలు చేస్తూ అద్భుతాలు సృష్టిస్తున్నారు. నేత పరిశ్రమకు కేంద్రమైన సిరిసిల్ల ఖ్యాతిని ఇనుమడించేలా రాజన్న సిరిపట్టు చీరను రూపొందించారు. అంతేకాక చేనేత రంగంలో కనీవిని ఎరగని రీతిలో అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీర, దబ్బనంలో దూరే పట్టు చీరతో పాటు జీ20 లోగోను మగ్గంపై నేసి ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసలు సైతం అందుకున్నారు. ఇటీవల హైదరాబా ద్ కేంద్రంగా జరిగిన మిస్ వరల్డ్ పోటీల్లో చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ తన ప్రతిభను ప్రదర్శించారు. హరిప్రసాద్ నేసిన చేనేత కళారూపాలను చూసి దేశవిదేశాలకు చెందిన సుందరీమణులు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. హరిప్రసాద్ నేసిన పలు పట్టు చీరలను వస్త్రాలుగా కుట్టి మిస్ వరల్డ్ పోటీ మహిళలు ర్యాంప్ వాక్ చేశారు. చేనేత రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న హరిప్రసాద్ దంపతులను పలువురు అభినందిస్తున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు 12 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డీఆర్‌వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 12 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే వంట సరుకులకు సంబంధించిన బిల్లులు 2023 నుంచి రాలేదని తెలిపారు. దీనిపై అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. తక్షణమే బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు 10వేల రూపాయల వేతనం చెల్లిస్తామని మాట ఇచ్చారని అన్నారు. కనీస వేతనం ఇవ్వడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ గ్రీన్ ఛానల్ ద్వారా పీఎఫ్, ఎంఎస్ ద్వారా బడ్జెట్ విడుదల చేసి నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ సాయిలు, ప్రధాన కార్యదర్శి రజిత, కార్యదర్శి దేవేంద్ర, ఎం లక్ష్మి, బి భాగ్య, హాలియా తదితరులు పాల్గొన్నారు.

ఆదివరాహస్వామి జయంత్యుత్సవాలు ముగింపు



స్వామి వారికి అభిషేకం చేస్తున్న పూజారులు

కమాన్‌పూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆదివరాహ స్వామి జయంత్యుత్సవాలు గురువారం ముగిసాయి. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేశారు. ఆలయ వేదపండితులు హోమం నిర్వహించారు. ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఉదయమే సుప్రభాతం, నిత్య తిరువారాధన, సేవాకాలం, నిత్యాభిషేకం, గోపూజ, 108 కలశాలతో ఆదివరాహ స్వామికి అభిషేకం చేశారు. చివరగా పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు కలకుంట్ల వరప్రసాదస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఈవో కాంతారెడ్డి సౌకర్యాలు కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు

మంథనిరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురవాలని సూరయ్యపల్లి గ్రామస్తులు గురువారం గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కప్పతల్లిని భుజాన మోస్తూ గ్రామ పుర వీధుల్లో డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలంతా బిందెల్లో నీళ్లతో ఊరేగింపులో పాల్గొని గ్రామంలోని హనుమాన్ గుడివద్ద హనుమాన్ విగ్రహానికి 108 బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కప్పతల్లిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాతో..

రూ. 2,500 జమ నమ్మవద్దు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్‌లో అకౌంట్ ఉంటే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 2,500 రూపాయలు జమ చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వదంతులు నమ్మవద్దని, ఇది అసత్య ప్రచారమని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఫేక్ న్యూస్‌లను నమ్మవద్దని, ఇందులో ఎలాంటి వాస్తవమూ లేదని తెలిపారు. ప్రభుత్వపరమైన నిర్ణయాలను రాష్ట్ర, జిల్లా యంత్రాంగం అధికారికంగా ధ్రువీకరిస్తేనే వాస్తవంగా పరిగణించాలని పేర్కొన్నారు.

హెచ్ఎంఎస్‌తో తెలంగాణ జాగృతి ములాఖత్...!

(5వ పేజీ తరువాయి)

అవకాశం ఉన్నట్టు సమాచారం. హెచ్ఎంఎస్ అఖిల భారత సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్‌గా మారనున్నట్టు హెచ్ఎంఎస్ నాయకులు చెబుతున్నారు. హెచ్ఎం ఎస్, కవిత వర్గానికి ఈనెల 10న జరిగే ప్రతినిధుల భేటీలో అంగీకారం కుదిరితే హెచ్ఎంఎస్ మహాసభల్లో కవిత గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నుకునే అవకాశాలను చర్చిస్తున్నట్టు తెలుస్తున్నది. గతంలో మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి హెచ్ఎంఎస్ జాతీయ నాయకుడిగా కొనసాగుతూ టీఆర్ఎస్ అనుబంధంగా కొంత కాలం పని చేశారు. కొన్ని సందర్భాల్లో సింగరేణి కార్మిక పోరాటాలు, తెలంగాణ పోరాటాల్లో టీఆర్ఎస్, హెచ్ఎంఎస్, టీబీజీకేఎస్ కలిసి పని చేసిన చరిత్ర కూడా ఉన్నది. ఏది ఏమైనా కవిత తీసుకున్న పొలిటికల్ కౌంటర్ సింగరేణి కేంద్రంగానే బీఆర్ఎస్‌పై మొదలు కానున్నది.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాపిరెడ్డికి డాక్టరేట్



పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ట్రినిటి ఇంగ్లీష్ మీడియం ఎయిడెడ్ పాఠశాల హెచ్ఎం పాపిరెడ్డి ద్రవిడ యూనివర్సిటీ నుంచి ఫిజిక్స్ విభాగంలో పీహెచ్‌డి అందుకున్నారు. ఆన్ ఇన్వెస్టిగేషన్ ఆన్ ఇన్‌ప్లైయెన్స్ ఆఫ్ రేడియేషన్ ఆన్ సమ్ పోలిమర్స్ అండ్ కో పాలిమర్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ నెల 5న పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ప్రస్తుతం ఆయన డిప్యూటేషన్‌పై ఎంపీపీఎస్ చందపల్లిలో ఫిజిక్స్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ట్రినిటి చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అభినందించారు. ఈ పరిశోధన అంశానికి సంబంధించిన ఆరు ఆర్టికల్స్ అంతర్జాతీయ జర్నల్లో ప్రచురితమయ్యాయి.

మహిళా సంఘం సభ్యురాలికి ఎలక్ట్రిక్ ఆటో అందజేత

పెద్దపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్త్రీ నిధి ద్వారా మంజూరైన ఎలక్ట్రికల్ ఆటోను మహిళా సంఘం సభ్యురాలికి కలెక్టర్ కోయ శ్రీహర్ష పంపిణీ చేశారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం స్త్రీ నిధి ద్వారా కనగర్తి గ్రామానికి చెందిన గంగభవాని గ్రామాఖ్య సంఘంలోని ధనలక్ష్మి స్వశక్తి సంఘ సభ్యురాలు ఏడెల్లి రజిత తిరుపతికి ఆటో పత్రాలను అందజేశారు. డీఆర్‌డీఓ కాళిందిని, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా మహాచండీ హోమం

మంథని, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం రాంరెడ్డి కాంప్లెక్స్‌లో బీజేపీ నేత చంద్రుపట్ల సునీల్‌రెడ్డి తల్లిదండ్రులు మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి-వసుమతిలతో కలిసి మహాచండి హోమాన్ని గురువారం నిర్వహించారు. పాలేపు చంద్రశేఖర్‌శాస్త్రి ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలి



సుల్తానాబాద్ సభలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాంమ్మూర్తి, ఎలిగేడులో కార్మికుడిని సన్మానిస్తున్న నాయకులు

సుల్తానాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు రాజకీయంగా రాణించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల రాంమ్మూర్తి అన్నారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పూసాల రోడ్డులో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులను సన్మానించి స్వీట్లు పంచారు. ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని, పలు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. ఓదెల మల్లిఖార్జున ఆలయ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన సామల యమున హరిక్రిష్ణ దంపతులను సన్మానించారు. గుండా మురళి, సాయిరి మహేందర్, తుమ్మ రాములు, మేరుగు వెంకటేష్, రవి పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులను సన్మానించారు. గోలి రమణయ్య, కేశవులు, జక్కుల జగన్నాథం, వెంకటనర్సయ్య, చేరాల పెద్దరాజయ్య, కర్నె శంకర్, సాదుల గట్టయ్య, ఒడ్నాల నర్సయ్య తదితరులను సన్మానించారు. పద్మశాలి సంఘం గ్రామ అధ్యక్షుడు గోలి సుధాకర్, చేరాల శంకర్, పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలి కమ్యూనిటి హాల్‌లో చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. పద్మశాలి కార్మికులను సన్మానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులకు సంక్షేమ అభివృద్ధి పథకాలను అందజేయాలన్నారు. మామిడాల రమేష్, కోడూరి సత్యనారాయణ, బూర్ల వెంకటసత్యం, వెంగల్‌దాస్ రాజమౌళి, భాస్కర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పద్మశాలి సహకార సేవా సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులను సన్మానించారు. అనంతరం చేనేత వస్త్రాల ప్రాముఖ్యత, నిరాదరణకు గురవుతున్న పద్మశాలి వృత్తిపై పలువురు మాట్లాడారు. ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, క్యాతం శ్రీనివాస్, తుమ్మ మధు, క్యాతం రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పద్మశాలి కులస్థులు, చేనేత కార్మికులు మార్కండేయ స్వామి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గాజెంగి కొమురయ్య, చిప్ప నర్సయ్య, తిరుపతి, రాజేశం, బుచ్చిరాములు, పాల్గొన్నారు.

టూటౌన్‌ను తనిఖీ చేసిన డీసీపీ



కంప్యూటర్‌లో వివరాలు పరిశీలిస్తున్న డీసీపీ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను గురువారం పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ సర్కిల్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. నమోదైన కేసుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి త్వరితగతిన ఛార్జిషీట్లు వేయాలని సూచించారు. సైబర్ క్రైం, మహిళలపై వేధింపులకు రక్షణగా నిలిచే చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, లింగమూర్తి, ఎస్సై అప్పాదుల్లా ఉన్నారు.

విద్యార్థులు ప్రజాస్వామ్యంపై అవగాహన పెంచుకోవాలి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఏఎస్ఐ నీలిమ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వేదవ్యాస హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలపై అవగాహన, ఎన్నికల ప్రక్రియపై వివరించారు. మాక్ జనరల్ స్కూల్ ఎలక్షన్లు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులుగా బాగా చదువుకొని గొప్ప కొలువుల్లో ఉండాలని తెలిపారు. అనంతరం హెడ్ బాయ్ కోసం విద్యార్థులు పోటీ పడగా జాలిగం వివేక్, తిరిగి నివేదిత గెలుపొందగా, వారికి పత్రాలను అందించారు. కరస్పాండెంట్ జూపాక ఉమామహేశ్వర్, పాఠశాల డైరెక్టర్ గుర్రం దివాకర్, ప్రిన్సిపాల్ కోట సదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే మహాలక్ష్మీ ఆలయం

మంథని, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నమ్మి కొలిచే భక్తుల కొంగు బంగారంగా మంథని మహాలక్ష్మి ఆలయం విరాజిల్లుతోంది. ఆధ్యాత్మిక వేత్తల ప్రవచనాలతో మంత్రపురి మహాలక్ష్మి వైభవం నలుదిశలా పాకింది. దీంతో ఆలయానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజాప్రతినిధులు తరలి వస్తున్నారు. 800 సంవత్సరాల క్రితం మంథని సమీపంలో ఉన్న రావుల చెరువులో మహాలక్ష్మి అమ్మవారి విగ్రహం లభ్యమైనట్లు తెలుస్తోంది. ఓ వేదమూర్తికి అమ్మవారు కలలో దర్శనమిచ్చి తాను కలువ కొలనులో ఉన్నానని, ఇక్కడే ప్రతిష్ఠించాలని సూచించగా పండితులు, గ్రామస్థుల సహకారంతో కొలనులో గాలించగా అమ్మవారి విగ్రహం లభ్యమైంది. కట్ట ఒడ్డునే ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారు మంత్రపురిలో స్వయంభూగా వెలిసారు.

గర్భగుడిలో కొలువుదీరిన మహాలక్ష్మి అమ్మవారిని ఎంత సేపు చూసిన భక్తులకు తనివితీరదు. పసుపు.. నుదుట కుంకుమ్మ.. చతురు భుజాలు.. ఒక చేతిలో కత్తి, మరో చేతిలో అక్షయ పాత్ర పట్టుకొని ఉన్న అమ్మవారిని వీక్షించడానికి భక్తుల రెండు కళ్ళు చాలవు.

పట్టణంలో నాలుగు చెరువులు, రెండు కుంటలు ఉన్నప్పటికి రావుల చెరువులో ఏడాదంత కమలం పూలు విరివిరిగా పూస్తాయి. వాటితోనే నిత్యం అమ్మవారి మూల, ఉత్సవ విగ్రహాలను వేదపండితులు, భక్తులు పూజిస్తున్నారు. ఆలయం వెనుక వైపు రావుల చెరువు కనుచూపు మేర విస్తరించి ఉంటుంది. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులు చెరువు అందాలను తిలకిస్తారు. ప్రతీ శుక్రవారం అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వస్తున్నారు. మహిళలు అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు చేస్తారు. ఒడి బియ్యం పోయడం తోపాటు సారె, గాజులు, పూలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు సమర్పిస్తారు. ఆషాఢమాసంలో అమ్మవారికి ప్రత్యేకపూజల తోపాటు వివిధ రకాల కూరగాయాలు, పండ్లతో శాకాంబరిగా అలంకరించి భక్తులు కొలుస్తారు. శ్రావణ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమ పూజలు నిర్వస్తారు. వరలక్ష్మి శుక్రవారం రోజున వేలాది మంది భక్తులు అమ్మకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేస్తారు.

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా పాఠశాలల్లో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనం దేశానికి, ధర్మానికి రక్ష అంటూ విద్యార్థులచే రాఖీలు కట్టించారు. బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ కుమార్, కార్యదర్శి కొత్తగట్టు నాగరాజు, దాసరి కృష్ణ, దిలీప్, సంతోష్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): పలు విద్యా సంస్థలో యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు జరుపుకున్నారు. తుమ్మ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల, హైస్కూల్ లో హిందూ వాహిని ఆధ్వర్యంలో రాఖీ వేడుకలను నిర్వహించారు. శాతాళ్ల కుమార్, కృష్ణ, తీర్థాల కుమారస్వామి, వంగరి చందు, క్యాతం సాయి, వర్షిత్ పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ముందస్తు రాఖీ వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వంశీ మోహనచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాఖీ పండగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

కార్మిక హక్కుల సాధనకు నిరంతర పోరాటం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) కార్మిక హక్కుల సాధనకు సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు జిల్లా ప్లంబర్ ట్రేడ్ యూనియన్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అగ్రిమెంట్స్ ద్వారా పనిని నాణ్యతతో చేయాలన్నారు. ఇంటి యజమానులు గుర్తింపు కార్డులు ఉన్నవారికే పనులు ఇవ్వాలని సూచించారు. బార్ అసోసియేషన్ లీగల్ అడ్వయిజర్ సురేష్‌బాబు, యూనియన్ కార్యదర్శి నరేష్, మాచర్ల అంజి. పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారంపెగడపల్లి శివారులో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసిన పోలీసు, రెవెన్యూ అధికారులను అభినందించారు. అలాగే జిల్లాలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠినంగా ఉండాలని, నిబంధనలకు లోబడి అనుమతి ఉన్న వారు మాత్రమే ఇసుక రవాణా చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై జీఎం సమీక్ష

రామగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు గురువారం అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జీఎం కార్యాలయం వేదికగా ఏర్పాట్లు నిర్వహించాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అధికారులు శేఖరబాబు, రామ్మోహన్, వెంకటరమణ, రాజశేఖర్, ప్రవీణ్, బానుప్రసాద్‌రావు, జనార్ధన్‌రెడ్డి, రాజేంద్రకుమార్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని గురువారం ఓసీపీ-1 మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మెడికల్ అటెండెన్స్ నిబంధనలు మార్చాలని, జూలై 31న నిర్వహించిన మెడికల్ బోర్డుతో కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ఈపీ ఆపరేటర్లకు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త బొగ్గు గనులను ప్రారంభించాలని, 18 నెలలుగా నిర్వహించకుండా జాప్యం చేసిన సేఫ్టీ ట్రైపార్టైడ్ సమావేశాన్ని నిర్వహించాలని, సెక్టార్-3 కాలనీలో క్వార్టర్లు మరమ్మతు చేయక పోవడంతో శిథిలావస్థకు చేరాయన్నారు. కొలిపాక సారయ్య, వెంకటేష్, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్, తిరుమలేష్, రాజన్న, సతీష్, వినయ్, ఉన్నారు.

సెక్యూరిటీ సిబ్బంది వితరణ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా సెక్యూరిటీ సిబ్బంది ఇటీవల మృతి చెందిన ప్రైవేట్ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. సెక్యూరిటీ విభాగంలోని క్యాంపర్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న ఇరుగురాళ్ళ రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. సెక్యూరిటీ, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, డ్రైవర్లు కలిసి రూ.56,400 సేకరించారు. గురువారం రాజేందర్ కుటుంబ సభ్యులను ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అంగీకరించిన డిమాండ్లపై సర్క్యులర్ జారీ చేయాలి



సీఎండీకి వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ అధ్యక్షకార్యదర్శులు

గోదావరిఖని, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో యాజమాన్యం జరిపిన స్ట్రక్చర్ కమిటీ, డైరెక్టర్ (పా) స్థాయి సమావేశాల్లో అంగీ కరించిన డిమాండ్లపై సర్క్యులర్లు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలపై సీఎండీతో చర్చలు జరిపారు. పదిహేను రోజుల్లో యాజమాన్యం అంగీకరించిన డిమాండ్లపై సర్క్యులర్లు జారీ చేయించి అమలు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. జూలై 31న కొత్తగూడెంలో జరిగిన మెడికల్ బోర్డులో 55మంది మెడికల్ బోర్డుకు హాజరు కాగా ఐదుగురిని మాత్రమే అన్‌ఫిట్ చేశారని, అనారోగ్యం తో బాధపడుతున్న వారికి మళ్లీ మెడికల్ బోర్డు నిర్వహించాలని సీఎండీ కోరారు.

సింగరేణి సీపీఆర్‌వో సుభానికి జాతీయ స్థాయి పురస్కారం



సుభానికి అవార్డు అందజేస్తున్న గంటా చక్రపాణి

గోదావరిఖని, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ముఖ్య ప్రజా సంబంధాల అధికారి, జీఎం(కో ఆర్డినేషన్) ఎస్‌డీఎం సుభాని ప్రతిష్టాత్మక డాక్టర్ సీవీ నరసింహారెడ్డి-పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి జాతీయ స్థాయి ఉత్తమ పీఆర్ మేనేజర్-2025పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ హాల్‌లో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాణి అవార్డును ప్రదానం చేశారు. 12 ఏరియాలలో ప్రజా సంబంధాలను పటిష్టంగా నిర్వహిస్తున్నందుకు ఈ అవార్డును బహూకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుభానికి జాతీయ స్థాయి లో ఉత్తమ పీఆర్ మేనేజర్ అవార్డు రావ డంపై సీఎండీ ఎన్ బలరామ్ అభినందనలు తెలిపారు.

సింగిరెడ్డిపల్లెలో వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సింగిరెడ్డిపల్లెలో గురువారం సింగరేణి ఆర్జీ-1 యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. మెడికల్ క్యాంప్‌లో గ్రామస్థులకు వైద్యులు సీజనల్ వ్యాధులతోపాటు బీపీ, షుగర్, కంటి, చర్మవ్యాధుల పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఏసీఎంఓ డా. అంబిక తెలిపారు. వైద్య శిబిరంలో 125 మంది గ్రామస్థులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. డా.పద్మ, సీనియర్ పీఓ హన్మంతరావుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జీ-3 డివిజన్‌లో సమస్యల పరిష్కరించాలి

రామగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలోని ప్రధాన సమస్యలతోపాటు ఓసిపి-2 ప్రాజెక్టులో నెలకొన్న సమస్యలపై ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి, ఐఎన్‌టీయుసీ శ్రేణులు గురువారం ప్రాజెక్టు అధికారి వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఆరు ప్రధాన డిమాండ్‌ల పై వినతిలో పేర్కొన్నారు. క్వార్టర్స్‌కు నూతన పైప్‌లైన్, కోల్‌కారిడర్ రోడ్డు నిర్మాణం, రామగుండం రిజియన్‌కు చెందిన ఆపరేటర్లకు ప్రమోషన్ జాప్యం, సీఎంపీఎఫ్ చిట్టీలు క్లారిటిపై వినతి పత్రం అందజేశారు.

ప్రజా సమస్యల పై జీఎంకు వినతి

రామగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పన్నూరులో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కరించాలని గురువారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ వినతి పత్రం అందజేశారు. పన్నూర్ సెంటర్ వద్ద బస్టాండ్ రోడ్డు ఎత్తుగా మారడంతో వర్షం నీరు అందులోకి చేరుకుంటుందని ఎర్కొన్నారు. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్‌లో దిమ్మెలకు రెకుల షెడ్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

హెచ్ఈఏంఏం పోస్టులకు ఇంటర్వ్యూ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3లో హెచ్ఈఏంఏం పోస్టులకు గురువారం అధికారులు బేస్ వర్క్‌షాప్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో 62 జనరల్ అసిస్టెంట్ హెచ్ఈఏంఏం ఖాళీలకుగాను 16 మంది జనరల్ అసిస్టెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు. డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈ) మురళీకృష్ణ, ప్రాజెక్టు ఇంజనీర్ రాజాజీ, డీవైఎస్ఈ రామకిషోర్, డీవైపీఎం వంశీధర్, సంక్షేమ అధికారి అజీజ్ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

2, 2ఏ గనిని సందర్శించిన ఆర్‌జీ-1 జీఎం

గోదావరిఖని, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డీ లలిత్ కుమార్ గురువారం జీడీకే 2, 2ఏ సెక్షన్‌లోని భూగర్భగని సందర్శించారు. 2సీమ్‌లోని ఎస్ఎస్ 13/2ను పరిశీలించారు. జీడీకే 2ఏ సెక్షన్ జీవితకాలం పెంచే భద్రతా అవగాహన, 1 సీమ్‌ను తిరిగి తెరవడంపై సలహా ఇచ్చారు. రక్షణ సూత్రాలు పాటించాలన్నారు.

రక్షాబంధన్‌ను పెయిడ్ హాలిడేగా ప్రకటించాలి

గోదావరిఖని, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్‌ను పెయిడ్ హాలిడేగా ప్రకటించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ సింగరేణి డైరెక్టర్ (పా)ను లేఖ ద్వారా కోరారు. గాంధీ జయంతి, దసరా పండుగ రెండు ఒకే రోజున రావటం, ఉద్యోగులకు ఒక పెయిడ్ హాలిడే కోల్పోయినట్టయిందని పేర్కొన్నారు. ఇప్పటికే డబ్ల్యూసీఎల్ సంస్థ ఈ నెల 9న రక్షాబంధన్ రోజున సెలవు ప్రకటించినట్లు గుర్తు చేశారు. సింగరేణి ఉద్యోగుల అభిప్రాయాలను గౌరవిస్తూ, డబ్ల్యూసీఎల్ మాదిరిగానే సింగరేణి కూడా రక్షాబంధన్‌ను పెయిడ్ సెలవుగా ప్రకటించాలంటూ జనక్ ప్రసాద్ కోరారు.

బిల్లులు చెల్లించక సింగరేణి స్కూల్ బస్సు నిలిపివేత

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి స్కూల్ బస్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ నిలిపివేసినట్టు సీఐటీయూ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ పేర్కొన్నారు. కాలనీ పరిసర ప్రాంతాల నుంచి రోజు బస్ ద్వారా పాఠశాలకు వస్తున్నట్టు తెలిపారు. మూడు ట్రిప్పులు నడుస్తున్న బస్సుకు 10 నెలల నుండి బిల్లులు చెల్లించలేదని తెలిపారు. కాంట్రాక్టర్ బస్ సర్వీస్‌ను నిలిపివేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్టు పేర్కొన్నారు. మే నెలలో మూడు బస్సులకు యాజమాన్యం టెండర్లు ఆహ్వానించిందని, పాఠశాల ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఒకే బస్సుతో నెట్టుకు రావడం సరికాదన్నారు.

ఇటీవల భర్తీ చేసిన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వలేదని, ఉపాధ్యాయులు గైర్హాజరు అవుతున్నట్టు తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా టాయిలెట్లు లేవని, డైనింగ్ హాల్‌కు నిధులు మంజూరు చేసినా పనులు పాంరంభించలేదని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కుంట ప్రవీణ్ డిమాండ్ చేశారు.

ఐటీఐని సందర్శించిన విద్యార్థులు

సుల్తానాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐటీఐ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను సుల్తానాబాద్‌కు చెందిన ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గురువారం సందర్శించారు. వాహనాల తయారీ, వాటి ఉపయోగాలను, పరికరాలను అమర్చే విధానం పరిశీలించారు. ఐపీఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణప్రియ మాట్లాడుతు విద్యార్థులకు సాంకేతిక పరమైన అవగాహన కలుగుతుందని, సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటారన్నారు. ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

అంకూస్ స్మారక పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకొన్న కళాకారులు

కోల్‌సిటీ టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): డప్పు నాట్యాచార్యులు జనరంజని కళా సంస్థ వ్యవస్థాపకులు కనకం అంకూస్ స్మారక పురస్కారాల ప్రదానోత్సవం గురువారం సింగరేణి ఎస్‌సీ, ఎస్‌టీ స్ఫూర్తి భవన్‌లో నిర్వహించారు. అంకూస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారులు రేణిగుంట్ల రాజమౌళి, వెంకటేశ్వరరావు, తాటిపాముల నరసయ్య, పాలపర్తి నాగరాజు, కొట్టే సాంబరాజు, పుల్లూరి సంతోష్‌లను పురస్కారాలతో సత్కరించారు. కాసుపాక రాజమౌళి అధ్యక్షత వహించగా గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కనకం రమణయ్య, ప్రధాన కార్యదర్శి మాద శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సోగాల వెంకటి, ప్రచార కార్యదర్శి నాగుల శ్రీనివాస్, అట్లా జగ్గయ్య, పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థికి అభినందన

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో జరిగిన సౌత్ ఇండియా స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో ఉషోదయ హైస్కూల్‌కు చెందిన ఎండి రెహాన్ ప్రతిభ కనపర్చగా గురువారం పాఠశాలలో కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. రెహాన్ ఆరెంజ్ బెల్ట్(కుమితే స్పారింగ్ విభాగం)లో ద్వితీయస్థానంలో నిలిచి వెండి పతకం సాధించాడు. కరాటే మాస్టర్ చందును అభినందించారు.

డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కమాన్‌పూర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ పెంచికల్‌పేట డబుల్ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ల పొదలు, తుమ్మ చెట్లను తొలగించారు. మండల కేంద్రంలోని శ్రీపాద విగ్రహం నుంచి పెంచికల్ పేట వరకు మూడు కిలోమీటర్ల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి మంత్రి శ్రీధర్ బాబు రూ.4 కోట్లు మంజూరు చేశారు. ఏఈ అనుదీప్ పనులను పర్యవేక్షించారు. సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ఎలిగేడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్‌లోని ప్రగతి టెక్నో స్కూల్‌లో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని గురువారం క్విజ్ పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ గర్రెపల్లి సురేందర్, ప్రిన్సిపాల్ గర్రెపల్లి కావ్య, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్, ఇంచార్జి కేరళ గోపి, నవత, దేవి తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘం కార్యవర్గం

సుల్తానాబాద్, ఆగస్టు 7: (ఆంధ్రజ్యోతి): మండల వీర బాద్రియ, వీర ముష్టి కులసంఘం కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా ఆగల్ల రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మిట్టపల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా కడారి శ్రీనివాస్, కోశాధికారిగా మల్యాల నరేష్, ఉపాధ్యక్షుడిగా కడారి సంజీవ్, సహాయ కార్యదర్శిగా మిట్టపల్లి సతీష్‌లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎనిమిది మంది ఎన్నికయ్యారు.

చికిత్సకోసం ఎల్‌వోసీ అందజేత

ముత్తారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన పునగుర్తి సరోజన అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఖర్చుల కోసం మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం నుంచి ఎల్ఓసీ ద్వారా 2లక్షల 50వేల రూపాయలు మంజూరు చేయించగా మంత్రి వ్యక్తిగత సహాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. దొడ్డ బాలాజీ, బాధిత కుటుంబం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదులకు ఆన్‌లైన్‌లో శిక్షణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

సుల్తానాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్షలకు హాజరవుతున్న న్యాయవాదులకు రెండు నెలలపాటు ఆన్‌లైన్‌లో ఉచిత కోచింగ్ ఇస్తామని టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ వరలక్ష్మి అన్నారు. సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్లను న్యాయవాదులతో కలిసి ఆవిష్కరించారు. ఆసక్తి గల న్యాయవాదులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అభిలాష్ ఆశ్రిత్‌ను 9133035555 సంప్రదించి, ఈనెల 10లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. తిరుపతిరెడ్డి, భూమయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఓదెల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల చెల్లింపుపై జాప్యం ఉంటే దృష్టికి తీసుక వస్తే సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తానని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి అన్నారు. గురువారం కనగర్తిలో పర్యటించారు. రేషన్ కార్డులు లేని అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న దృష్టికి తీసుకువస్తే పరిష్కారిస్తామని తెలిపారు. రాహుల్, చొప్పరి రాజయ్య, వెంకటేష్, ఉడిగే సదయ్య, మహేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సెంటినరీకాలనీ కార్యవర్గం

రామగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా మేకల మారుతీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జోనల్ చైర్మన్ శశాంక, సాదుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నియమించారు. ప్రధాన కార్యదర్శిగా అబ్బుకేశవరెడ్డి, కోశాధికారిగా కోప్పుల శ్రీపాద రావు, చీఫ్ కోఆర్డినేటర్‌గా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కళాధర్‌రెడ్డి, సత్యరెడ్డి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా శరణ్యాయాదవ్, ఎడ్యుకేషనల్ సర్వీస్ ఇంచార్జిగా సత్యనారాయణ, సభ్యులు కాటంసత్యం, సోషల్ సర్వీస్ ఇంచార్జిగా టీవీ సురేష్‌బాబు, క్లబ్ డైరెక్టర్లుగా 11మంది నియమించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం

అంతర్గాం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ముర్మూర్ గ్రామానికి చెందిన పోతుగంటి రాకేష్ కొన్ని రోజులుగా క్యాన్సర్ వ్యాధి బారిన పడి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాకేష్‌కు చికిత్స నిమిత్తం ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ గురువారం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని బాధితుని తండ్రికి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వర్ధన్నపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బొలెరో వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫిరంగిగడ్డ ప్రాంతంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం సాగరం గ్రామానికి చెందిన కరిక మోహన్‌రావు (55) ద్విచక్రవాహనంపై భార్య పద్మతో కలిసి వర్ధన్నపేట నుంచి సాగరం గ్రామానికి వెళ్తున్నాడు. బొలెరో వాహనం ఢీకొట్టడంతో మోహన్‌రావు అక్కడిక్కడే మృతి చెందగా పద్మ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతుడు మోహన్‌రావు పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు.